క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శంకేశి మల్లికార్జున్ తెలిపారు. కంటి ఆస్పత్రి, కొత్తవాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు అనిశెట్టి రజిత యాదిసభ

కేయూ క్యాంపస్: ఇటీవల మృతిచెందిన ప్రజాస్వామిక రచయిత్రుల సంఘం జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత యాదిసభను ఈనెల 7న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బూర భిక్షపతి, బిల్లా మహేందర్, కొమ్రరాజు రామలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో వరంగల్ సాహిత్య సామాజిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో యాదిసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రజితతో అనుబంధం ఉన్న వివిధ ఉద్యమ సాహిత్య సంస్థలు, ప్రజాసంఘాలు, బంధు మిత్రులు పాల్గొనాలని వారు కోరారు.

ఉత్తమ కరస్పాండెంట్‌గా మాడుగుల హరితారెడ్డి



హన్మకొండ: ఉత్తమ స్కూల్ కరస్పాండెంట్‌గా హనుమకొండ 100 ఫీట్ల రోడ్డులోని ఎలైట్ ఇంటర్ నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ మాడుగల హరితరెడ్డి అవార్డు అందుకున్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌రావు, కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా బెస్ట్ కరస్పాండెంట్‌గా ప్రశంస పత్రం అందుకున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజుకు విద్యారత్న అవార్డు



కేయూ క్యాంపస్: విద్యారత్న పురస్కారాన్ని కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్, కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్ఎఫ్ శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ చేతులమీదుగా పురస్కారాన్ని రాజు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్, తదితరులు సన్మానించారు.

రేషన్ దుకాణాల బంద్ విజయవంతం

ఖిలా వరంగల్: తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో శుక్రవారం చేపట్టిన రేషన్ దుకాణాల బంద్ విజయవంతమైంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 13 మండలాల్లో రేషన్ దుకాణాలను డీలర్లు మూసివేసి స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బంద్‌కు వినియోగదారులు సైతం మద్దతు తెలిపినట్లు వారు తెలిపారు. పెరుగుతున్న ధరలు, షాపుల అద్దెలు, గుమస్తా భత్యం, విద్యుత్ బిల్లులు, ఇంటర్‌నెట్ చార్జీలు, దిగుమతి హమాలీ చెల్లింపుల భరించలేక పోతున్నామని డీటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు దరావత్ మోహన్ నాయక్ కోరారు.

వివాహిత ఆత్మహత్య

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్నేహనగర్‌లో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ మేకల రంజిత్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం మాదిరిరెడ్డి కృష్ణవేణి (38) మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పలు ఆస్పత్రులకు వెళ్లినా బాగుపడలేదు. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో పెంట్‌హౌస్‌లోని రాడ్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ వివరించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి చెరుకుపల్లి సాంబరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోదరభావంతో కలిసి ఉండాలి

కమలాపూర్: కుల, మత, వర్గ బేధాలు లేకుండా ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. వినాయకుడి వద్ద మాజీ ఎంపీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకులు బాలసాని లత-రమేశ్‌గౌడ్, సాయితేజ గౌడ్ శుక్రవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ గుండె బాబు, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్, స్థానిక ఇన్‌స్పెక్టర్ హరికృష్ణతో కలిసి ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించి అన్న ప్రసాదాలు వడ్డించారు.

ఘనంగా నిమజ్జన వేడుకలు





రంగసముద్రం చెరువులో విఘ్నేశ్వరుడి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ శుభం

తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను నగర వ్యాప్తంగా భక్తులు శుక్రవారం చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. - సాక్షి నెట్‌వర్క్





హనుమకొండ హంటర్ రోడ్డు నందిహిల్స్‌లోని శ్రీజ అపార్ట్‌మెంట్‌లో గణపతి మండపం వద్ద మహిళలు



బెస్తం చెరువులో నిమజ్జనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఇన్‌స్పెక్టర్ రమేష్



కాశిబుగ్గలో వినాయకుడి విగ్రహాన్ని కారుపై తీసుకెళ్తున్న భక్తులు



మట్టి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



గణపతి నిమజ్జనంలో పాల్గొన్న యువకులు, చిన్నారులు



కడిపికొండలో..



49వ డివిజన్ ఎన్ఎంబీసీ కాలనీలో వేలంలో లడ్డూ దక్కించుకున్న డాక్టర్ జె.రవికుమార్



మడికొండ: విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న పోలీసులు, మున్సిపల్ సిబ్బంది



బీఆర్ఎస్ కార్యాలయంలో వినాయకుడి నిమజ్జనం







కాజీపేట పట్టణంలో గణనాథుడికి వీడ్కోలు పలుకుతున్న అభయాంజనేయ స్వామి దేవాలయ భక్తులు





గణేశ్ నిమజ్జన ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న మహిళలు, చిన్నారులు



వాగ్దేవి కళాశాలలో వినాయక ఊరేగింపులో కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

వైభవంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడి కల్యాణం



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడి కల్యాణ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో దేవతామూర్తుల కల్యాణ ఘట్టాన్ని అర్చకులు కనులపండువగా జరిపించారు. గణపతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16 రోజులుగా సాగుతున్న మహాగణపతి హోమానికి అర్చకులు పూర్ణాహుతి పలికారు. పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, తుమ్మ శ్రీనివాస్, గంగుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తక్షణమే యూరియా సరఫరా చేయాలి

హన్మకొండ: రైతులకు తక్షణమే యూరియా సరఫరా చేయాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శి గన్నెబోయిన వెంకటాద్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో యూరియా కొరత వలన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వ్యవసాయ సహకార సంఘాల గోదాముల వద్ద పడిగాపులు కాస్తూ ఎదురుచూస్తున్నారని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి, ఇతర పంటలకు సకాలంలో యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గి రైతులకు తీవ్రనష్టం ఏర్పడుతుందని తెలిపారు. అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిని ఒకవైపు రైతు తీవ్రంగా నష్టపోగా, మరోవైపు పంటలకు సకాలంలో ఎరువులు వేయక పోవడంతో దిగుబడి తగ్గి నష్టపోయే అవకాశముందని పేర్కొన్నారు. యూరియా అందని రైతులు ఆందోళన చేస్తే వారిపై కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైంది



హసన్‌పర్తి: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అతిథులు



వరంగల్‌లోని జగన్మాత వైట్‌హౌస్‌లో ఉపాధ్యాయులను అభినందిస్తున్న వాసవి క్లబ్ బాధ్యులు

హసన్‌పర్తి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైందని మండల అభివృద్ధి అధికారి రవి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమళ్ల సుధీర్, వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ పావుశెట్టి శ్రీధర్, జిల్లా సంయుక్త కార్యదర్శి బొక్క కుమార్, మాజీ అధ్యక్షుడు దుర్గారాం, గౌరవ అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు గుండమీది విజయ్ మోహన్, చకిలం చంద్రశేఖర్, వేల్పుల తిరుపతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..

వాసవి క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కార్యదర్శి పురవర్ధన్, కోశాధికారి మాధవ్, క్లబ్ మాజీ అధ్యక్షుడు గౌరిశెట్టి కృష్ణమూర్తి, భీష్మనాథం, జోన్ చైర్మన్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్లకు..

మడికొండ: రిటైర్డ్ ఉపాధ్యాయులు భూక్య పూలన్యానాయక్, రాజేంద్రప్రసాద్‌ను మడికొండ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జయరాజ్ సన్మానించారు.

యోగా గురువుకు..

విద్యారణ్యపురి: సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, యోగా గురువు, రిటైర్డ్ ప్రొఫెసర్ జంగా గోపాల్‌రెడ్డిని రామక శ్రీనివాస్, ఉపాధ్యాయులు పబ్లిక్ గార్డెన్‌లో సన్మానించారు.



మడికొండలో..



విద్యారణ్యపురి: గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న టీచర్లు, యోగా సభ్యులు

విద్యుత్ ఉద్యోగులకు అండగా..



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తూ, వారి హక్కుల కోసం పోరాడుతూ అండగా నిలుస్తున్న యూనియన్ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ఈఈయూ)-327 మాత్రమేనని ఆ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని టీఎస్ఈఈయూ కార్యాలయం పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో హనుమకొండ ఎమ్మార్టీ డివిజన్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం డివిజన్ బాధ్యులు, సభ్యులు టీఎస్ఈఈయూలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి శ్రీధర్ ఆహ్వానించారు. కార్యక్రమంలో టీఎస్ఈఈయూ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికల సదయ్య, కార్యదర్శి చిట్ల ఓదెలు, రాష్ట్ర నాయకుడు జశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి మదర్ థెరిస్సా

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట: పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల ఆదర్శమూర్తి మదర్ థెరిస్సా చూపిన ప్రేమ, ఆప్యాయతలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మదర్ థెరిస్సా 28వ వర్ధంతిని పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్ జంక్షన్‌లోని ఆమె విగ్రహానికి కెథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డితో కలిసి ఎమ్మెల్యే నాయిని శుక్రవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బొక్క దయసాగర్, టీడీ టామి, సభ్యులు ఎ.ప్రకాష్ రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రొఫెసర్ తిరుణహరి శేషు, డాక్టర్ అనిష్ సిద్దిక్, ఆర్.రాజ్‌మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, తదితరులు

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న గాదగోని రవి

● ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

వరంగల్ చౌరస్తా: రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రజా సమస్యలను విస్మరిస్తూ, ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి విమర్శించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో రాజా సాహెబ్ అధ్యక్షతన వరంగల్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తమకు అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను మాత్రమే జాబితాలో ఉంచి మిగతా వారి పేర్లను కేంద్రం తొలగిస్తోందని ఆరోపించారు. తన అధికార ప్రాబల్యాన్ని, నియంతత్వాన్ని కాపాడుకునేందుకు అడ్డదారిలో తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల్లో కొన్ని హామీలను మాత్రమే ప్రభుత్వం అరకొరగా అమలు చేస్తోందని అన్నారు. అధిక వర్షాలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, కుసుంబ బాబురావు, నగర కార్యదర్శి మాలోతు సాగర్, కనకం సంధ్య, సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

వరంగల్ చౌరస్తా: జీఎస్టీ టారిఫ్‌ల తగ్గింపుతో దేశ ప్రజలకు వస్తువులు, సరుకులు తక్కువ ధరల్లో లభిస్తాయని వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి వరంగల్ కాశిబుగ్గలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. బీజేపీ వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రదీప్‌రావు మాట్లాడారు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియం తగ్గింపుతో పేదలకు ఆరోగ్య, ఆర్థిక భద్రత అందుబాటులోకి వస్తుందన్నారు. పాలు, పన్నీర్, మందులు, పాఠశాల సామగ్రి, వ్యవసాయ పరికరాలు, ఎరువులు వంటి నిత్యావసర వస్తువులపై రేటు తగ్గింపుతో ప్రజలు, రైతులకు ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తాబేటి వెంకట్‌గౌడ్, నాయకులు సముద్రాల పరమేశ్వర్ పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మంచి రచనలు చేయాలి



రిటైర్డ్ అధ్యాపకుడిని సన్మానిస్తున్న బాధ్యులు

విద్యారణ్యపురి: సమాజానికి ఉపయోగపడే రచనలు చేయాలని విశ్రాంత అధ్యాపకులైన రచయితలను ఆర్‌సీటీఏ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పులి సారంగపాణి కోరారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్‌సీటీఏ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకులైన రచయితలు 20మందిని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌సీటీఏ బాధ్యులు విద్యాసాగర్, సత్యనారాయణ, డాక్టర్ మల్లారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పక్షిని రక్షించిన పర్యావరణ ప్రేమికుడు

శాయంపేట: కొత్తగట్టు సింగారం స్టోన్‌క్రషర్ పరిసర ప్రాంతంలో అరుదైన రాక్ ఈగల్ (గుడ్లగూబ) గాయాలతో పడి ఉండగా శుక్రవారం అటుగా వెళ్తున్న పర్యావరణ ప్రేమికుడు వేణు గమనించి ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపల్లి సునీల్‌కు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని గుడ్లగూబను జూపార్క్‌కు తరలించి వైద్యం అందించారు.

కార్మికులకు ఎక్స్‌గ్రేషియా పెంపుపై హర్షం

కాజీపేట రూరల్: భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా పెంపుపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కడిపికొండ బ్రిడ్జి కింద రైల్వే ఈఎల్ఎస్ పార్కులో శుక్రవారం సమావేశం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యమడాల హనుకాంత్, గబ్బెట ఎల్లేష్, వక్కల రుద్రయ్య, భాగ్య, అజాజ్ అహ్మద్, కీర్తి, సురేష్, తిరుపతి, అనిల్, సంధ్య, స్రవంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనుకాంత్

కోచ్ ఫ్యాక్టరీలో అవకాశం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

కాజీపేట: ఉమ్మడి వరంగల్ జిల్లావాసుల చిరకాల వాంఛగా ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో నూతన ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత.. ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్న విషయాన్ని పాలకులు గుర్తించి రైల్వేలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రజాప్రతినిధులు ఒక్కతాటిపైకి వచ్చి రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రుల సహకారంతో స్థానిక యువతకు ఉపాధి లభించేలా చూడాలని చుక్కయ్య కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, తొట్టె మల్లేశం, జంపాల రమేష్, సంటి రవి, రామంచ సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఉర్సులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఉర్సులో కమాల్ పాషా హవేలిలో హజ్రత్ సయ్యద్‌షా యాహియా పాషా నబీరా ఖాద్రీ సాహెబ్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రవక్త మహమ్మద్ జీవన సందేశంపై సమాజంలో శాంతి, సోదరభావం, సేవాభావం, సామరస్యాన్ని నెలకొల్పేలా ముస్లిం పెద్దలు ప్రసంగాలు చేశారు. మైనార్టీ మత పెద్దలతో కలిసి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్నారు. ముస్లింల ఆరాధ్య దైవమైన మహ్మద్ ప్రవక్తను మహ్మద్ షకీల్ హైమద్, మహ్మద్ మగ్దుం హైమద్, ఎండీ.నిసార్ హైమద్, గఫార్ స్మరించుకున్నారు.